

వస్తూనే చిరాకుగా కూర్చున్న భర్తను చూసి సబ్బు, టవలు బాత్‌రూంలో పెట్టి, ''లెండి. బట్టలు మార్చుకుని మొహం కడుక్కోండి. ఈలోగా కాఫీ తెస్తాను'' అంటూ నవ్వుతూ వంటింట్లోకి నిష్క్రమించింది సుజాత.

ఆమె కాఫీ కప్పుతో వచ్చేసరికి ముఖం కడుక్కున్న ఛాయలేవీ కనపడలేదు భర్త ముఖంలో. కూర్చున్న చోటునుండి లేచినట్లు కూడా లేదు. దగ్గిరగా వచ్చి భర్త నుదుటిపై చెయ్యి వేసింది. ఒంట్లో బాగుండవి

# భయం

**గుమ్మా ప్రసన్నకుమార్**

రాజులా బ్రతకాలని కలలు కనే వారి సంఖ్య ఏ కాలంలో అయినా అధికమే. శ్రమపడవలసిన అవసరమేమీ లేకుండా అన్నీ సమకూడిన వారికి కాలం మాత్రం గడవదు. అప్పుడేమిటి కర్తవ్యం?

...క్షణాలేమీ కనిపించకపోయేసరికి ఆశ్చర్యపోయింది.

"ఏమిటి? ఏమయింది?" ఆదుర్దాగా ప్రశ్నించింది సుజాత అతని దగ్గరగా కూర్చుంటూ. మాధవరావు ఆమె ముఖంలోకి చూస్తూ కూర్చుండిపోయాడు.

"అలా ఉన్నారేం?" తిరిగి ప్రశ్నించింది.

ఆమె కళ్లలోని తన ప్రతిబింబాన్ని చూస్తూ, 'నేను ... నేను" అన్నాడు. ఆపైన "నేను ఉద్యోగం మానేస్తాను, సుజా!" అని తొందర తొందరగా అనేసి ఆదుర్దాగా ఆమె వేపు చూశాడు మాధవరావు.

"బాగానే ఉంది." కిలకిలా నవ్వింది సుజాత. "దీనికేనా ఇంత ఆర్భాటం చేసింది! బాగుంది. మొదట కాఫీ తాగండి."

మాధవరావుకు చిర్రెత్తుకు వచ్చింది. తను ఎంతో గంభీరంగా, తీవ్రంగా అన్న మాటలను కూడా ఎప్పుడూ తేలికగా తీసుకొని నవ్వేస్తూంటుంది. మరి మాట్లాడ్డానికి వీలులేకుండా నోరు కట్టేస్తుంది. 'నవ్వొకటి వచ్చు, బాగా' అనుకున్నాడు మాధవరావు.

"తాగండి మరీ." గారంగా హెచ్చరించింది సుజాత. ఆ గారాలే చాలు మాధవరావులోని శక్తులను చల్లార్చడానికి. గుటగుటా రెండు గుక్కల్లోనే తాగేశాడు. కప్పు ఆమె చేతికిస్తూనే ఒక్కసారి ఆమె ముఖంలోకి చూసి తన గదిలోకి వెళ్లిపోయాడు.

మాధవరావు ప్రవర్తనకు సుజాత ఆశ్చర్యపోయింది. ఒక పదిరోజులనుంచి మాధవరావు ప్రవర్తనలోని మార్పులు గమనిస్తూంది. ఏదోఅనబోయి అంతలోనే తర్వకొని మాధవరావు గుర్తుకు తెచ్చుకుంది. భర్త చెప్పడానికి సందేహిస్తున్న విషయం బహుశా తనకు ఇష్టం ఉండదు అన్న సంశయంతోనే ఏమీ తెలియనట్లుగా ప్రవర్తించింది సుజాత. మాధవరావు తత్వం సుజాతకు బాగా తెలుసు. తాడు తెగేదాకా లాగకూడదన్న తత్వం సుజాతది. అందుకనే భర్తను మరి కదపలేదు. తనకు తనే పని పురమాయించుకొని వంటింట్లోకి దారితీసింది సుజాత. కానీ, మాధవరావు తత్వం వేరు. తాడు పట్టుకొనేందుకు సహాయం కోరతాడు. తరవాత తెగేంతవరకూ లాగగల శక్తి ఉంది. కానీ, సుజాత తాడు పట్టుకొనే ప్రయత్నమైనా చెయ్యలేదు. అదే మాధవరావు బాధ. నెలరోజులనుంచి సుజాతతో చెపుదామనుకున్న ముక్కలవి. ఈ సమయం కోసం ఇన్ని రోజుల నుంచి ఎదురుచూశాడు కానీ...

మాధవరావు ముఖం కడుక్కొని, ఆరుబయట కుర్చీ వేసుకొని కూర్చున్నాడు. మాధవరావుకు అతని వేపు తలిదండ్రులు గానీ, బంధువులు గానీ లేరు. ఉన్న ఆస్తికి అతనే వారసుడు. ఆ ఆస్తితో ఒక తరం గారంటీగా వెళ్లిపోతుంది. ఆ ఆస్తే అతన్ని ఈ వింత కోరికకు గురి చేసింది. రెండవ కారణం కూడా లేకపోలేదు! ఆ మాటకు వస్తే రెండవ కారణమే అతని హృదయంలో బలంగా, దిట్టంగా నాటుకుంది. అదే ... హాయిగా ఇంట్లోనే భార్యతో, పిల్లలతో పక్కింటి రామనాథంలా గడపవచ్చు. రామనాథం ఎక్కువ చదువుకున్నవాడు కాదు. రెండు మూడు మేడలు మాత్రం ఊరి మధ్యలో ఉన్నాయి. వాటివల్ల వచ్చే రాబడితో మాధవరావుకన్నా దర్జాగా, ఆనందంగా కాలం గడుపుతున్నాడనే మాధవరావు బాధ. రామనాథానికి ఉద్యోగం చేద్దామన్న తలంపు ఉన్నా ఇచ్చే నాథుడు లేడు. తన చదువే తనకు ముప్పు తెచ్చిందని మాధవరావు చెప్పుకుంటాడు.

చిరాకుగా లేచి అటూ ఇటూ తిరుగుతూ మధ్య మధ్య రామనాథం ఇంటికేసి చూపు మళ్లించసాగాడు మాధవరావు. రామనాథం ఒక పిల్లవాణ్ణి ఒళ్లో కూర్చో పెట్టుకొని, మరొకణ్ణి రకరకాల మాటలతో తెగ నవ్విస్తూంటే, వాళ్లిద్దరి నవ్వులతో చిన్నవాడు కూడా చిన్న నవ్వు జోడిస్తున్నాడు. ఇదంతా రోజూ జరిగే తతంగమే. మాధవరావు అటు చూడలేక ముఖం తిప్పేసుకున్నాడు. ఎక్కణ్ణించో పరిగెత్తుకుంటూ వచ్చి కాళ్లకు చుట్టుకొని "నాన్నా!" అంటున్న మురళిని కసురుకున్నాడు.

పదిహేను రోజులు అలా అలా గడిచాయి. ఈ పదిహేనురోజులలో మళ్లీ మాధవరావునోటంట ఆ మాటలు వినలేదు సుజాత. కానీ, మాధవరావు ఆ రోజు వస్తూనే, "ఉద్యోగం మానేస్తాను, సుజా! నా కేమిటోగా ఉంది" అన్నాడు.

"ఏమంటున్నారు?" అపనమ్మకంగా అడిగింది సుజాత.

"ఉద్యోగం మానేస్తాననా అని. రేపే రాజీనామా ఇచ్చేస్తాను."

"ఎందుకూ? ఏమైందని?"

మాధవరావు ఏదో చెప్పబోతూండేసరికి, "ఏమర్రా! ఇంట్లోకి వచ్చినా గమనించలేనంత చర్చలో ఉన్నారేమిటి? బాగుంది. ఇంట్లో ఎవడేనా దొంగ ప్రవేశించినా ఇంతే కాబోలు!" అని వస్తూనే దీవనలిచ్చింది కాంతమ్మ, సుజాత తల్లి.

"ఎప్పుడు వచ్చావ్? నాన్నగా రేరి? ఒక్క ఉత్తరం ముక్క వ్రాయలేకపోయావా? ఆయన స్టేషన్‌కు వచ్చేవారు కదా? మంచి పనే" అంటూ తల్లిని కౌగిలించుకుంది సుజాత. మాధవరావు తెచ్చిపెట్టుకుంటున్న నవ్వుతో పలకరించాడు అత్తగారిని. ఆ సమయంలో అత్తగారి రాక అతనికి ఇష్టం లేదు. ఆవిడ అక్కడ నెలరోజులు ఉండడంవల్ల తన రాజీనామా విషయాన్ని మాధవరావు అత్యవసరంగా పొడిగించుకున్నాడు. ఆ నెల రోజుల్లో ఆ ఊసే ఎత్తలేదు. కాంతమ్మ ఊరికి వెళ్లిపోవడంతో తిరిగి సమస్య లేవదీశాడు.

"నే నింక ఉద్యోగం మానేస్తాను" అన్నాడు భోజనాల దగ్గిర.

"ఇంతవరకు ఏదో నవ్వులాటకు అన్నారనుకున్నాను. మాటిమాటికీ ఏమి టా మాటలు?" చిరుకోపం ప్రదర్శించింది సుజాత.

"ఇదేం వేళాకోళం కాదు."

"ఔను. నేనూ అదే అంటున్నది. ఉద్యోగంతో పరిహాస మేమిటని."

"నాకు ఉద్యోగం చెయ్యాలని లేదు" అన్నాడు మాధవరావు దృఢ నిశ్చయంతో.

"ఎందుకని అడుగుతున్నాను." రెట్టించింది సుజాత.

"చెయ్యవలసిన అవసరం లేదు కనక."

"ఉద్యోగం మానేసి ఏం చేద్దామని?"

"మానేసి....మానేసి...." చెయ్యి కడుక్కొని లేచిపోయాడు మాధవరావు. "నాకూ రామనాథంలా ఇంట్లోనే కూర్చుని రోజల్లా నీతో కబుర్లు చెపుతూ గడపాలని ఉంది" అని చెప్పలేకపోయాడు. భర్త వెనకనే సుజాత కూడా నడుస్తూ అడిగింది:

"నే నడిగినదానికి సమాధానం రాలేదు."

"రాదు! చెప్పను! ఏం?" తీవ్రంగా అన్నాడు. "కారణం అంటూ ఏమీ లేదు."

"ఒక పని ఎవరైనా చేస్తున్నారంటే దానికి తగ్గ కారణం ఉండబోదని నే నంగీకరించను." నెమ్మదిగా అన్నది సుజాత.

"అయితే, నన్ను కారణం చెప్పమని నిర్బంధిస్తున్నావా?" ఎక్కడాలేని ఆవేశంతో అన్నాడు.

"నిర్బంధం కాదు. తెలుసుకోవాలని ఉంది."

చటుక్కున ఆమె జబ్బ పట్టుకొని కళ్లలోనికి సూటిగా చూస్తూ అడిగాడు "ఏం? నే నింట్లోనే ఉండటం ఇష్టం లేదా? అయినా, నేను ఉద్యోగం చెయ్యడంవల్ల మనకు, ముఖ్యంగా నీకు లాభమేమిటి?"

"మీ కెల్లా అనిపించినా నాకు మాత్రం మీరు ఉద్యోగం చెయ్యడమే ఆనందం. నేనూ సాటివారిలో నా భర్త ఫలానా ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నారు' అని సగర్వంగా చెప్పాలనిపిస్తుంది. సాయంత్రం మీకోసం ఎదురుచూడ్డంలో నేను ఎంతో తృప్తి చెందుతాను. అందరిలానే అలిసి వచ్చిన భర్తకు సేవ చెయ్యడంలో నేను స్వర్గాన్ని సృష్టించుకుంటాను. ఉదయాన్నే ఉక్కిరి బిక్కిరిగా పనులు చేసి మిమ్మల్ని ఆఫీసుకు పంపడంలోనూ, తిరిగి సాయంత్రం మీ కోసం

వేచి ఉండటంలోనూ నాకెంతో హాయి ఉంది. ప్రతి స్త్రీ కోర్కె కోరిక ఇదే. ఇదేమీ లోకవిరుద్ధం కాదని నా భావన.''

''లెక్చరే ఇచ్చావు. నీ ఆనందం కోసం, తృప్తి కోసం నేను నరకాన్ని అనుభవించినా సరేనన్నమాట!''

''ఉద్యోగం చేస్తున్నందువల్ల మీకు కలుగుతున్న కష్టం ఏమిటి?''

''మరి ప్రశ్నలు వెయ్యకు. నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను. నిన్ను సలహా అడగడం నాపొరపాటే. నా పంథాలో నడవడం ఇష్టం లేకపోతే నువ్వు మీ ఇంటికి వెళ్ళవచ్చు.''

''ఇంటికా?''

''ఔను.''

''ఒక్కసారి ఆలోచించండి. నేను మిమ్మల్ని అడిగిన దాంట్లో అసందర్భమైనదేదీ లేదనుకుంటాను.''

''ఆలోచించేది లేదు. ఇది నే నెప్పుడో చేసుకున్న నిర్ణయం. నా బుద్ధి గడ్డితిని నిన్ను అడిగాను. అంగీకారమైతేనే ఉండు.''

సుజాత నుండి సమాధానం రాలేదు.

ఆరాత్రికి రాత్రే సుజాతను, పిల్లల్ని బండి ఎక్కించేసి ఇంటికివచ్చి అసంతృప్తిగా కళ్ళు మూసుకున్నాడు మాధవరావు. రెండు గంటల కిందట జరిగిన సంఘటనే కళ్ళలో మెదులుతున్నది. సుజాత తనకు ఎదురు చెపుతుందని కలలో కూడా అనుకోలేదు. తను ఇంట్లో ఉండటం సుజాత కిష్టం లేదా? ఎందుకు? ఉద్యోగం మానేస్తానని చెప్పిన వెంటనే ఎగిరి గంతేస్తుం దను కున్నాడు తను.

మరునాడు ఆలస్యంగా లేచాడు. హోటలుకు వెళ్లి కాఫీ తాగి వచ్చి వరండాలో కుర్చీ వేసుకొని కూర్చున్నాడు. రకరకాల ఆలోచనలు ఒక గమ్యం చేరక అతన్ని చిరాకు పెడుతున్నాయి. ఆఫీసుకు వెళ్ళడానికి ఇష్టంలేక పది రోజులు సెలవు పెట్టినట్లు సెలవు చీటీ వ్రాసి పంపించాడు. రోజూ అయితే ఈపాటికి లేచి ఆదరా బాదరాగా అన్నీ ముగించుకొని ఆఫీసుకు వెళ్లిపోయేవాడు మాధవరావు. హఠాత్తుగా రామనాథం మీదికి ఆలోచనలు మళ్లాయి.

రామనాథం అదృష్టవంతుడు. హాయిగా భార్యతో కబుర్లు చెపుతూ కాఫీ తాగుతూంటాడు ఈపాటికి. తన కా అదృష్టం లేదు. ఔను. అందరికీ ఉంటుందా? ఒక్కొక్కరు పుట్టిన వేళా విశేషం. తనూ రామనాథంలా ధనవంతుడైనా తన కా అదృష్టం లేదు. రాత్రివేళ తప్ప మిగతా సమయాల్లో మాట్లాడ్డానికి కూడా సందు లేకుండా పని చేసుకు పోతూంటుంది సుజాత, పని మనిషిని కూడా మాన్పించేసి.

ఖంగుమన్న కంచుకంఠంతో ఈ లోకంలోకి వచ్చాడు మాధవరావు.

''ఇంకా అలా కూర్చున్నారేమిటి? బజారుకు వెళ్లి కూరలు పట్టండి.''

''ఇప్పుడే కదే కాఫీ తాగాను! ఒక్క ఘడియ పోయిన తరవాత వెళతాను.'' వేడుకుంటున్న స్వరం.

''కూర ఆలస్యంగా తెచ్చినా పది గంటలకే పడాలి ముద్ద.'' వినుగు.

''అబ్బబ్బ! వెళతానే, బాబూ!'' గట్టిగా అరిచాడు రామనాథం.

''ఉద్యోగం సద్యోగం లేదు కానీ, కోపాలు మాత్రం ఉన్నాయి గొంతు నిండా.''

''వెళుతున్నానే. సంచీ ఇలా ఇయ్యి.''

''పనిలో ఉన్నాను! సంచీ తీసుకోలేరూ? తొందరగా తెమిలి రండి. పిల్లలు లేచారంటే నన్ను పనులు చేసుకోనివ్వరు.''

చరచరా నడుస్తున్న రామనాథాన్ని చూస్తూ కూర్చున్నాడు మాధవరావు.

మూడవ రోజు మధ్యాహ్నం:

అప్పుడే భోజనం చేసి వచ్చి పడుకున్నాడు మాధవరావు. పక్క ఇంట్లో నుండి రామనాథం భార్యామణి మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

''జైహింద్‌లో మంచి సినిమా ఉందిట.''

''ఆహా. వెండిబొమ్మలేనా? బాగుంటుందిట. తప్పకుండా ఇవాళే మాటినీకి పోదాం.'' హుషారుగా అన్నాడు రామనాథం.



నౌబత్ పహాడ్ (హైదరాదు) ఫోటో — వి. ఎస్. సేలం (సికింద్రాబాదు)

''పోదాం కాదు. పోతాను.''

''ఏం? నేనో?''

''పిల్లల్ని ఎవరు చూస్తారు? వాళ్లతోపాటు సినిమాకు వెళ్లినా, సంతకు వెళ్లినా ఒక్కటే. మీరు ఇంట్లో ఉండి పిల్లల్ని చూస్తూ ఉండండి. పిల్లలకు మీ రంటే మచ్చిక కూడా. ఏడిస్తే వంటింట్లో పాలున్నాయి. వెచ్చబెట్టేసి ఇద్దరికీ ఇచ్చేయండి. నేను వచ్చేసరికి చీకటి పడుతుందేమో!''

మాధవరావు అటునించి ఇటు తిరిగి పడుకున్నాడు.

• • •

ఆ రోజు నాలుగు గంటలకు గేటు తీసి లోపలకు అడుగు పెడుతున్న రామనాథాన్ని చూసి ఆశ్చర్యపోయాడు మాధవరావు. పక్క పక్కనేఉన్నా ఇంతవరకూ ఇద్దరికీ పరిచయమే లేదు.

''నమస్కారమండీ'' అన్నాడు నసుగుతూనే.

''నమస్కారం. కూర్చోండి'' అన్నాడు కుర్చీ చూపిస్తూ.

''నా పేరు తెలుసుననుకుంటాను. మీవల్ల ఒక సహాయం కావాలండీ. నే నీ మధ్యనే మెట్రిక్ పాసయాను. ఉద్యోగం చేద్దామని ఉందండీ. ఎక్కడేనా ఖాళీ ఉంటే దయచేసి నాకు సహాయం చెయ్యాలి. ఇంట్లో ఇరవై నాలుగు గంటలూ...ఛ... ఛ... ఛ... ఏమీ తోచడం లేదండీ.''

''తప్పకుండానండీ. చూస్తాను.'' హామీ ఇచ్చాడు మాధవరావు.

''థాంక్స్'' అంటూ వెళ్లిపోయాడు రామనాథం.

• • •

ఆ రోజు సుజాత మాధవరావు దగ్గిరనుండి ఉత్తరం అందుకుంది.

''సుజాకు,

ఆశీర్వచనములు. అందరూ కులాసాగా ఉన్నారని తలుస్తాను. ఈ ఉత్తరం అందిన వెంటనే రాగలవు. పై అధికారి ఇన్‌స్పెక్షన్‌కు వస్తున్నాడు కనక నాకు సెలవు దొరకలేదు. నువ్వు గెలవడమే నా కిష్టం.

ఇట్లు
నీ మాధవ్.''

తాజాకలం: ''ఎక్కింటి రామనాథానికి ఉద్యోగం దొరికింది.''

ఉత్తరం అడుగున ఉన్న తాజాకలానికి అంత ప్రాముఖ్యం ఏమిటా అని తెగ ఆలోచించింది సుజాత. కానీ, అర్థం కాలేదు. ★